నత్తనడకన జీపీ భవన నిర్మాణాలు

స్థానిక పాలనను ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో గత రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. ఆయా గ్రామపంచాయతీలకు కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీ భవనాలను ఎంపిక చేసి నాడు అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఇరుకు గదులలో కార్యాలయం నిర్వహించుకోవడం అధికారులకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో పక్కా భవనాలు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు పలుమార్లు అప్పటి ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. కానీ ఏడాది క్రితం ప్రారంభమైన పనులు నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయాయి.

- మంజూరు 19.. నిర్మాణ దశలో 16.. నిలిచిపోయినవి మూడు
- ఏడాది గడిచినా పూర్తి కాని పనులు


స్లాబ్ లెవల్‌లో ఉన్న తిలక్‌నగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం

ఇల్లెందురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఆవిర్భవించిన గ్రామపంచాయతీలలో మొదటి విడతగా ఇల్లెందు మండలంలో 19 గ్రామపంచాయతీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐటీడీఏల ద్వారా నిధులు మంజూరు చేస్తూ 2023 జనవరి 13న అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బొజ్జాయిగూడెం, బాలాజీనగర్, సీఎస్పీ బస్తీ, ధనియాలపాడు, ఇందిరానగర్, లచ్చగూడెం, మామిడిగుండాల, మిట్టపల్లి, ముత్తారపుకట్ట, పూబెల్లి, రేపల్లెవాడ, సుభాష్‌నగర్, మస్సివాగు గ్రామపంచాయతీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా, మామిడిగూడెం, విజయలక్ష్మీనగర్, మొండితోగు, పోచారంతండా, బోయితండా, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలకు ఐటీడీఏ ద్వారా ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. నిధుల మంజూరుకు ముందే ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆయా గ్రామపంచాయతీలలో భవనాల నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను ఎంపిక చేసి రెవెన్యూ శాఖ ఆమోదంతో మండల స్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నత్తనడకన పనులు...

గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరై ఏడాది పూర్తయినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మంజూరైన సమయంలో స్థలం అన్వేషణలో కొంతకాలం, శంకుస్థాపన పేరుతో మరికొంత కాలం.. కాంట్రాక్టర్ల ఎంపిక కోసం మరికొంత కాలం పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇలా మండల వ్యాప్తంగా మొత్తం 19 గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల్లో ఇప్పటివరకు 16 గ్రామపంచాయతీలలో పనులు పడుతూ.. లేస్తూ.. జరుగుతున్నాయి. నాలుగు గ్రామపంచాయతీ భవనాలు స్లాబ్ లెవల్‌కు చేరుకోగా మిగతావన్నీ లెంటల్ లెవల్‌లోనే ఉండిపోయాయి. ఇదిలా ఉండగా గ్రామపంచాయతీలలో పాలకులు సైతం సీసీ రహదారులు, మురుగుకాల్వలు, మట్టి రోడ్ల నిర్మాణం విషయంలో చూపిన ఆసక్తిని గ్రామపంచాయతీ భవన నిర్మాణాలపై చూపడం లేదనే విమర్శలు వినపడుతున్నాయి. పరిపాలన చరమాంకంలో ఉండటంతో పాలకులు అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు.

స్థలం లేక ఒకచోట .. వివాదాలలో రెండుచోట్ల..

గత ప్రభుత్వం పంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ స్థానికంగా పాలకుల మధ్య విబేధాలు పంచాయతీ భవన నిర్మాణాలపై ప్రభావం చూపాయి. విజయలక్ష్మీనగర్‌లో సింగరేణి సంస్థ చూపిన స్థలంలో శంకుస్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలో అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కొందరు నిర్మాణ ప్రదేశం మార్చాలని ఒకమారు.. కాంట్రాక్ట్ తమకే కావాలని మరోసారి అడ్డుతగలడంతో పనులు నిలిచిపోయాయి. అంతేకాకుండా సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో నిర్మాణం సాఫీగా సాగుతున్న క్రమంలో పాలకవర్గంలో పొడచూపిన విబేధాలు గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ముందుకు సాగనివ్వలేదు. కాంట్రాక్టర్ లాయర్ నోటీసు అందుకోవాల్సి రావడంతో నిర్మాణ పనులు లెంటల్ లెవల్‌లోనే నిలిచిపోయాయి. ఇక ఇందిరానగర్‌లో రెవెన్యూ అధికారులు నేటికీ స్థలం చూపకపోవడంతో శంకుస్థాపనకు కూడా నోచుకోలేదు.


లెంటల్ లెవల్‌లో నిలిచిపోయిన సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం

పనులు వేగవంతం చేస్తాం..



మండలంలో 13 గ్రామపంచాయతీల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖకు, ఆరింటిని ఐటీడీఏకు అప్పగించారు. ఎన్నికల ప్రక్రియ ముందుకు రావడంతో నిర్మాణాలు పనులు మందగించాయి. ప్రసుత్తం పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగించేలా కాంట్రాక్టర్లను పురమాయించాం. పనులన్నీ స్లాబ్ లెవల్‌కు చేరుకున్నాయి.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఇల్లెందు

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ అంతర్భాగమైన రామవరం 8వ వార్డులో కొత్తగూడెం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బుధవారం రాత్రి నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జీఎం పర్సనల్ (వెల్ఫేర్) కట్టా బసవయ్య హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా వాకిట్లో రంగురంగుల ముగ్గులు వేయడం హిందూ సంప్రదాయంలో ఒక భాగమన్నారు. అంతరించి పోతున్న సంస్కృతులను బయటికి తీసి సనాతన ధర్మాలు చాటి చెప్పేందుకు ఈ పోటీలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. వాకిట్లో ఆవు పేడతో నీళ్ల చల్లటం ద్వారా దోమలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ టీపీసీసీ సభ్యులు జేబీ శౌరి, జిల్లా ఓబీసీ అధ్యక్షులు అల్లాడి నరసింహారావు, న్యాయ నిర్ణేతలుగా మొక్కల వెంకవీరయ్య సతీమణి రాయి లక్ష్మి, ప్రకృతి ఆశ్రమం, జి.శోభారాణి, ఉపాధ్యాయులు సభనా, యువజన నాయకులు ఏ.కుమారి, రావి కుమారి, కల్యాణ్, ఉర్సు శివ, బర్రె రాజేష్, ఉరుసు సందీప్, రహీమ్, శైరన్, ముకేష్ పాల్గొన్నారు.

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు నివాళి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు గురువారం పలుచోట్ల నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ... ఎన్టీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయంలో నిలిచారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


పాల్వంచ: నివాళులర్పిస్తున్న నాయకులు


టేకులపల్లిలో...

ఆగుతూ.. సాగుతున్న బ్రిడ్జి నిర్మాణం

- రూ.12 కోట్లతో ముర్రేడు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు
- వచ్చే నెలలో పూర్తి చేస్తామంటున్న అధికారులు


ముర్రేడు వాగుపై అసంపూర్తిగా రెండో బ్రిడ్జి పనులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి వద్ద ముర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఆగుతూ సాగుతున్నాయి. దీంతో శ్రీనగర్‌లోని మూడు లేన్లలోని ప్రయాణికులు రాకపోకలు కొనసాగించటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెం నుంచి భద్రాచలం, మణుగూర్, ఇల్లెందుకు ముర్రేడు వాగుపైనున్న బ్రిడ్జి నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోనే కాలేజీలు, విద్యా సంస్థలు ఎక్కువగా ఉండటం వల్ల, ఉదయం, సాయంత్రం ద్విచక్ర వాహనలు ముర్రేడు బ్రిడ్జి పైనుంచి వెళ్లడానికి ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులతో సతమతవుతున్నారు. 2016లో నేషనల్ హైవే వెడల్పులో భాగంగా రుద్రంపూర్ నుంచి భద్రాచలం వరకు 50 కిలోమీటర్ల వరకు సుమారు రూ.150 కోట్లు ఖర్చుతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇందులో రెండు ప్రధాన బ్రిడ్జిలు ఉన్నాయి. సుమారు రూ.12కోట్లతో రామవరంలోని గోధుమవాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. మరో రూ.12 కోట్లతో లక్ష్మీదేవిపల్లి మండలంలోని ముర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఎనిమిది పిల్లర్ల నిర్మాణం చేసిన కరోనా కారణంగా పనులు నిలిపివేశారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్‌హెచ్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన అధికారులు యుంగధర్, డీఈ శైలజ చొరవతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి ముర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణం పనులు మళ్లీ ప్రారంభించారు. బ్రిడ్జికి రెండు వైపులా అప్రోచ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెల పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

మైనారిటీ కళాశాలలో ప్రవేశాలు..

పాల్వంచ: పట్టణంలోని మైనారిటీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బిపాషా గురువారం తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ.. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో నాణ్యమైన విద్యతో పాటు ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్, ఐఐటీ తదితర ప్రవేశాలకు ఉచితంగా కోచింగ్, మెటీరియల్ కూడా అందిస్తున్నామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో 80 సీట్లు ఉన్నాయని, 60 ముస్లింలకు, 10 బీసీ, 4 ఎస్సీ, 4 ఎస్టీ, 2 ఓసీలకు కేటాయించినట్లు తెలిపారు. అడ్మిషన్ కొరకు ఫిబ్రవరి 6వ తేదీలోపు కిన్నెరసాని రోడ్డులోని మైనారిటీ గురుకుల కళాశాలలో సంప్రదించాలని లేదా 8919403948, 9581786989 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

నేటినుంచి గ్రామసభలు

పాల్వంచరూరల్: మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణ కోసం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బహుజన కార్మిక విభాగం ఆధ్వర్యంలో గురువారం ఎంపీఓ తులసీరామ్, ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు నిమ్మటూరి లక్ష్మయ్య మాట్లాడుతూ... పాఠశాల కార్మికులకు నెలసరి వేతనం రూ.9,500 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తంబర్ల నరసింహారావు, నునావత్ లక్ష్మణ్, నాగేశ్వరరావు, నరేష్, అనసూర్య, రాధిక, లక్ష్మి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గా స్వీట్లు పంపిణీ


స్వీట్లు అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని ప్రముఖ కూరగాయల వ్యాపారులు యాకూబ్ సేట్ కుమారులు ఎస్‌కే గౌస్, జానీ, ఖాజా అజ్మీర్ దర్గా షరీఫ్ ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేకంగా తయారు చేసిన స్వీట్లు పంపిణీ చేశారు. ఏటా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, దర్గా షరీఫ్ పేరుతో స్వీట్లు పంపిణీ చేసి భక్తిపారవశ్యం చాటుకుంటారు.

ఆడపడుచులకు కల్యాణలక్ష్మి వరం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: పేదరికంలో తమ ఆడపిల్లలకు వివాహం చేయలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరం లాంటివని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం విద్యానగర్‌లోని కమ్మ సత్రంలో లబ్ధిదారులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత మెరుగుపరిచి అమలు చేయడం అభినందనీయమన్నారు. పేద కుటుంబాలు, ప్రధానంగా మహిళల ఆర్థిక అవసరాలు గుర్తించి ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని, ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని, అతిత్వరలో పూర్తిస్థాయిలో ఈ పథకాలన్నీ అమల్లోకి వస్తాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదకుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ శాంతి, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ వినయశీల, సర్పంచులు, గోవిందు, సుగుణ, రెడ్డి శ్రీను, పద్మ, ఆరిఫ్, స్థానికులు వాసిరెడ్డి మురళి, భాగం మహేశ్వరావు, వంగ వెంకట్, రాంజీ, గండు శ్రీను, యాంత్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీ బ్రోచర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలో కరాటే టోర్నీ బ్రోచర్లను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 28న కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇంద్రాల శ్రీధర్, కరాటే ప్రెసిడెంట్ వాసు ఎమ్మెల్యేకు వివరించారు. జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా పోటీలను రెండు తెలుగు రాష్ట్రాల క్రీడాకారుల వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సీపీఐ అధ్యక్షుడు సాబీర్‌పాషా, మాజీ కౌన్సిలర్ బత్తుల సురేష్, రాజు కరాటే కోచ్, మ్యూజిక్ సురేష్ పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో నిర్వహించనున్న స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల వాల్‌పోస్టర్లను గురువారం డీఈఓ వెంకటేశ్వరచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఎల్టా సంఘం విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలను పెంచడానికి కృషి చేస్తోందని, ఆంగ్లంలో ఈ స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. అనంతరం ఎల్టా జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి, సెక్రెటరీ ప్రభాకర్ రావులు మాట్లాడుతూ.. ఆంగ్ల పోటీలను విజయవంతం చేయడానికి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ సహకరించాలని కోరారు. విద్యార్థుల ఆంగ్ల భాష నైపుణ్యం సాధించేందుకు స్పెల్లింగ్స్, సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ షేక్ మీరా హుస్సేన్, ఎల్టా కోశాధికారి వి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జహంగీర్ షరీఫ్, ఇంద్రసేనారెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామ్స్ కమిషనర్ మాధవరావు, ఏఎంఓ నాగరాజశేఖర్, సతీష్, బాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు సన్మానం


కనకయ్యను సన్మానిస్తున్న లచ్చగూడెంవాసులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం లచ్చగూడెంకు చెందిన పలువురు యువకులు గురువారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోయగూడెంలోని ఆయన స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందరర్భంగా లచ్చగూడెంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కోరం వినోద్, మీనా కుమారి, కొర్స అన్వేష్, పోలెబోయిన రాము పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరంలో 5వ తరగతిలోకి ప్రవేశం కోసం ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికోసం డిసెంబర్ 23వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని చెప్పారు. 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదివిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్నేహలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు పీజీలో 55 శాతం మార్కులు, బోధనానుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. 20వ తేదీన జరగనున్న మౌఖిక పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎస్‌అండ్‌పీసీ అధికారిని బదిలీ చేయాలి


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో లాంగ్ స్టాండింగ్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను బదిలీ చేయాలని, ప్రైవేట్ సెక్యూరిటీ టెండర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని గురువారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట బీఎస్పీ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో ఉత్పత్తి విభాగంలో పనిచేసే అధికారులను నియమించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ యూనిఫాం లేని అధికారులను నియమించడం సరైంది కాదన్నారు. ఏరియాలో కొంతకాలంగా నిబంధనలకు విరుద్ధంగా సెక్యూరిటీల నియమకాలు చేస్తున్న అంశంపై విచారణ చేపట్టాలని కోరారు. అంతేకాకుండా ఏరియా సెక్యూరిటీ అధికారిగా కొనసాగుతున్న వారి కాలపరిమితి అయిపోయిన వెంటనే బదిలీ చేయక పోవటంవల్ల ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ వారితో కలిసి నిబంధనలకు విరుద్ధంగా నిమామకాలు చేపడుతున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని సెక్యూరిటీ ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, సెక్యూరిటీ అధికారి అండదండలతో నిబంధనలు పాటించని సెక్యూరిటీ గార్డులను తొలగించాలని డిమాండ్ చేశారు. వారి స్థానంలో మాజీ సైనికులను సూపర్‌వైజర్లుగా నియమించాలని కోరారు. చెనిగరపు నిరంజన్‌కుమార్, సాయి, మాలోత్ వీరునాయక్, అల్లకొండ శరత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మోడైనా అందమే..


అంజనాపురం వద్ద పత్తి చేలో ఎండిన చెట్టు

ప్రకృతిలో ఎన్ని వింతలో... కొన్ని చెట్లు కొమ్మలు, ఆకులు, పూలు, పండ్లతో విరగ పూసి, కాసి వచ్చిపోయే వారిని ఆకట్టుకుంటాయి. కానీ పై ఫోటో చూడండి. కొత్త అంజనాపురం సమీపంలోని పత్తి చేనులో ఓ చెట్టు ఎండిపోయి మోడుబారి సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో దూరం నుంచి చూపరులకు కనువిందు చేస్తోంది.. ఈ చిత్రాన్ని గురువారం 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. – సుజాతనగర్

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సింగరేణి జీఎం


రోహిత్‌రాజుకు శుభాకాంక్షలు చెబుతున్న శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): నూతనంగా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన బి.రోహిత్ రాజును కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ.. జీఎంను ఏరియా ఉత్పత్తి, గనులు, ఓసీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు.

నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణ

ఇల్లెందురూరల్: గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేందుకు కేంద్ర భారతీయ స్టేట్ బ్యాంకు ఉపాధి శిక్షణ సంస్థ పలు కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఎంపీడీఓ బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్, టూ వీలర్ బైక్ మెకానిక్ కోర్సులు ఉంటాయని తెలిపారు. అనుభవజ్ఞులచే శిక్షణ ఉంటుందని, 19వ తేదీ నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. వివరాలకు 7842295972, 08742–295972 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయంలోకి యథావిధిగా ప్రవేశం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లోకి శుక్రవారం నుంచి భక్తులకు యథావిధిగా ఆలయ ప్రవేశం, పూజలు, దర్శనం ఉంటుందని ఆలయ ఈఓ కె.సులోచన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నందును ఆలయంలోకి ప్రవేశం లేదని గతంలో తెలియజేశామని, కానీ ప్రస్తుతం అనివార్య కారణాల వల్ల పనులు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

టేకులపల్లి: ఈనెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా గడపగడపకు రాముని అక్షింతల కార్యక్రమం గురువారం మండలంలోని ప్రెగ్లపాడు పంచాయతీలో ఘనంగా జరుపుకున్నారు. అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కణితి రమాదేవి, ఎంపీటీసీ బానోతు సరోజిని, లక్కినేని శ్యాం, లక్కినేని మురళి, లక్కినేని రంగా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కొత్తగూడెంఅర్బన్: సారా అక్రమ రవాణాకు సంబంధించి వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు కొత్తగూడెం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో గురువారం వేలంపాట నిర్వహించారు. మొత్తం నాలుగు వాహనాలను వేలం వేయగా రెండు టూ వీలర్స్‌ను కొత్తగూడేనికి చెందిన వారు దక్కించుకున్నారు. ఒక్క టూ వీలర్‌కు రూ.17500, మరో వాహనానికి రూ.11000 ఆదాయంతో పాటుగా 18 శాతం రెండు వాహనాలకు జీఎస్టీ రూ.4950 కలిపి మొత్తం రూ.33,450 ఆదాయం వచ్చిందని జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ కరంచంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ జయశ్రీ, ఎస్సై సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురంలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం.. సాయిరాంతండాకు చెందిన భూక్యా రాహుల్ బైక్‌పై పడమటనర్సాపురం వెళుతున్నాడు. అదే గ్రామానికి చెందిన నాగా కోటేశ్వరరావు బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాహుల్‌కు ముక్కు, ముఖానికి తీవ్ర గాయాలు కాగా, కోటేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. రాహుల్‌ను జూలూరుపాడు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.